పురాణ చెరువులో 'మృత్యుఘోష'

- చెన్నూర్ పెద్ద చెరువుకు ఏళ్ల చరిత్ర
- అగస్త్య ముని ఇక్కడే స్నానమాచరించారని ప్రసిద్ధి
- నేడు సూసైడ్ స్పాట్‌గా మారుతున్న వైనం
- రెండురోజుల వ్యవధిలో ఇద్దరి బలవన్మరణం
- పోలీసుల గస్తీ నిర్వహించాలని స్థానికుల విన్నపం



తిరుమలేశ్వరి మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకొస్తున్న దృశ్యం (ఫైల్)

చెన్నూర్: ఆత్మహత్యలకు చెన్నూర్ పెద్ద చెరువు వేదికగా మారింది. ఏడాది కాలంగా ముగ్గురు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకోగా, రెండు రోజుల వ్యవధిలోనే ఇద్దరు మృతి చెందారు. ఇద్దరిలో ఒకరు ఉన్నత విద్యాబ్యాసం చేసి ఉద్యోగం చేస్తున్న సరస్వతీ పుత్రిక ఉండడం గమనార్హం. ఈ ఏడాది జనవరి 2న బజ్జూరి మొగిలి(30) పెద్ద చెరువులో దూకి ఆత్మహత్య చేసుకోగా, ఈ నెల 15న దబ్బెట రాజమల్లు, 16న పసునూటి తిరుమలేశ్వరి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. ఒకప్పుడు పవిత్రతకు మారుపేరైన పెద్దచెరువు నేడు ఆత్మహత్యలకు వేదికయ్యిందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

పెద్దచెరువుకు ప్రాచీన చరిత్ర..

చెన్నూర్ పెద్ద చెరువుకు ప్రాచీన చరిత్ర ఉంది. పెద్ద చెరువును గతంలో గుండం అని పిలిచేవారు. ఆ గుండంలో అగస్త్య మహాముని స్నానమాచరించి ఎదురుగా గల శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారని పురాణాలు చెప్తున్నాయి. ఆనాడు చెన్నూర్ తాలుకా పరిధిలో ఇదే పెద్ద గుండం కావడంతో రానురాను గుండాన్ని పెద్ద చెరువుగా పిలుస్తున్నారు. అంతేకాకుండా గత చరిత్ర చూసినట్‌లైతే చెన్నూర్ ప్రజలకు తాగునీటి వనరుగా పెద్ద చెరువును వినియోగించారని ఈ ప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు.

దైవ కార్యక్రమాలు..

చెన్నూర్ పెద్ద చెరువులో దైవ కార్యక్రమాలు నిర్వహిస్తారు. గణేశ్, బతుకమ్మలు, దుర్గాదేవి విగ్రహాలతో పాటు పీరీలను నిమజ్జనం చేయడం ఆనవాయితీగా వస్తోంది. పెద్ద చెరువు ప్రాశస్త్యాన్ని గమనించిన అప్పటి ఎంపీపీ మైదం సత్యనారాయణ సొంత ఖర్చులతో పెద్ద చెరువు నడి ఒడ్డున లక్షలాది రూపాయలు ఖర్చు చేసి శివలింగాన్ని ప్రతిష్ఠించారు. శివలింగం నుంచి ఒడ్డు వరకు వంతెన నిర్మించారు. ఆయన మరణాంతరం పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. పెద్ద చెరువులో నిర్మించిన శివలింగం ప్రస్తుతం పర్యాటకులను ఆకట్టుకుంటోంది.

పెద్ద చెరువు కింద ఆలయాలు..

చెరువు కట్ట కింద ముగ్గురమ్మలు కొలువై ఉన్నారు. మైసమ్మ, పెద్ద మదనం, చిన్న మదనం పోచమ్మ ఆలయాలు ఉన్నాయి. ప్రతి ఆదివారం, బుధవారం, గురువారం వేలాది మంది భక్తులు మొక్కులు తీర్చుకుంటారు.

రూ.8కోట్లతో పెద్ద చెరువు అభివృద్ధి..

పెద్ద చెరువు అభివృద్ధికి ప్రభుత్వ విప్ బాల్క సుమన్ రూ.8లక్షల నిధులు మంజూరు చేయించారు. మినీట్యాంక్ బండ్ నిర్మాణంలో భాగంగా పెద్ద చెరువును ఆధునీకరించారు. పెద్ద చెరువుపై సెల్ఫీ స్పాట్‌తో పాటు చెరువు పై రోడ్డు, లైటింగ్ సిస్టమ్, రెండు వైపులా గ్రిల్స్ ఏర్పాటు చేయించారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం మినీట్యాంక్ బండ్ ప్రాంతం పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తుంది.

ఆయకట్టు కింద 420ఎకరాల సాగు..

పెద్ద చెరువు ఆయకట్టు కింద 420ఎకరాలు పంట సాగవుతోంది. గత మూడేళ్లుగా పంట పొలాలను రైతులు బీళ్లుగా వదిలేస్తున్నారు. ఒకప్పుడు పచ్చని పాడి పంటలతో పెద్ద చెరువు ఆయకట్టు ప్రాంతం ఆహ్లాదాన్ని పంచి పెట్టింది. పెద్ద చెరువు మరమ్మతులతో పాటు ఆధునీకరించడంతో రానున్న రోజుల్లో బీళ్లుగా ఉన్న భూముల్లో సిరులు కురిసే అవకాశం ఉంది.

పెద్ద చెరువుకు ఎంతో పేరుంది..



గతంలో పెద్ద చెరువులో స్నానాలు ఆచరించేవారు. గతంలో ప్రమాదవశాత్తు చెరువులో పడి చనిపోయిన సంఘటనలు సైతం తక్కువే. ఈ మధ్య కాలంలో చెరువులో దూకి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇప్పటికైనా పోలీసులు గస్తీ నిర్వహించాలి. తగిన చర్యలు తీసుకోవాలి. – నాగేశ్వర్‌రావు, చెన్నూర్

సమస్యలకు చావు పరిష్కారం కాదు...



సమస్యలుంటే చావే పరిష్కారం కాదు. ఎలాంటి సమస్యకైనా పరిష్కారం ఉంది. క్షణికావేశాలకు లోనై కఠినమైన నిర్ణయాలు తీసుకోవద్దు. ఆత్మహత్య చేసుకొని మృతి చెందితే, నీ కుటుంబం ఏమైపోతుందని ఒక్కసారి ఆలోచించాలి. మనుషుల్లో మార్పు రావాలి. – వాసుదేవరావు, సీఐ చెన్నూర్

క్లుప్తంగా

19న చర్చిలో ఉపవాస దీక్షల విరమణ



సోమగూడెంలోని కల్వరి మినిస్ట్రీస్ చర్చి

కాసిపేట: బెల్లంపల్లి సోమగూడెం రహదారి సమీపంలోని కల్వరి మినిస్ట్రీస్‌లో ఈ నెల 19న ఉపవాస దీక్షల విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించనున్నారు. ప్రతీ సంవత్సరం మాదిరి ఈ ఏడాది ప్రపంచశాంతిని కోరుతూ.. పాస్టర్ ప్రవీణ్ 50రోజులు ఉపవాస దీక్షలు చేపట్టినట్లు తెలిపారు. 19న ముగియనుండటంతో క్రైస్తవుల మధ్య విరమణ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. సమావేశానికి లక్షకు పైగా మంది హాజరు కానున్నారు. ఎప్పటిలాగే నిర్వాహకులు ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి సంబంధించి కల్వరి సమీపంలోని సొంత స్థలంలో ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు చండీహోమం

మంచిర్యాలఅర్బన్: దుర్గామాత శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక తెలంగాణ చౌరస్తా రోడ్‌నంబర్-1 రాళ్లపేట్ మణేశ్ గణేష్ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి వద్ద చండీహోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. లోకకళ్యాణార్థం, దేవాలయ నిర్మాణ సిద్ధ్యర్థం నిర్వహించే చండీహోమంలో పాల్గొని దేవీకృపకు పాత్రులు కావాలన్నారు.

'చెన్నూర్ కాంగ్రెస్‌కే కేటాయించాలి'



మాట్లాడుతున్న రాంచందర్

మందమర్రిరూరల్: చెన్నూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టిక్కెట్ కాంగ్రెస్ అభ్యర్థికే కేటాయించాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గందె రాంచందర్ డిమాండ్ చేశారు. స్థానికంగా అంబేద్కర్ విగ్రహానికి మంగళవారం వినతిపత్రం అందించి నిరసన తెలిపారు. సీపీఐకి చెన్నూర్ నియోజకవర్గంలో క్యాడర్ లేదని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని నిలబెడితే తప్పకుండా గెలుస్తారని వివరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఉపేందర్‌గౌడ్, మండల అధ్యక్షుడు నీలయ్య, లక్ష్మణ్, రాజు, శ్రీనివాస్, జమీల్, సుకూర్ తదితరులు ఉన్నారు.

'బతుకమ్మ'కు బంతిపూలు సిద్ధం



నెన్నెల: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలిచే బతుకమ్మ పండుగకు బంతిపూలు సిద్ధంగా ఉన్నాయి. మండలంలోని బొప్పారం, నెన్నెల, ఆవుడం, దుబ్బపల్లి, మన్నెగూడం, నందులపల్లి, గన్‌పూర్ గ్రామాల్లోని రైతులు పూలసాగు చేపట్టారు. ఈ సారి బంతిపూలు సిరులు కురిపిస్తాయని రైతులు పేర్కొంటున్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు వినతి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామంలోని 1వ, 2వ వార్డులకు చెందిన స్థానికులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం మంచిర్యాల ఎస్ఈ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో 1వ, 2వ వార్డు స్థానికులు నాయికిని సురేందర్, కోల రవి, మల్లయ్య, బోయిని రాజ్‌కుమార్, రాజగోపాల్, లక్ష్మీనారాయణ, మధు, శ్రీరాం, సతీశ్, మహేశ్ పాల్గొన్నారు.

'బాల్క సుమన్ వ్యాఖ్యలను ఖండించిన బీఎస్పీ'

మందమర్రిరూరల్: చెన్నూర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ జర్నలిస్టులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను బీఎస్పీ ఖండించింది. బీఎస్పీ చెన్నూర్ నియోజకవర్గం అధ్యక్షుడు తుంగపిండి రమేశ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. వెంటనే సుమన్ భేషరతుగా జర్నలిస్టులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

'రఘునాథ్ ఇంటిపై పోలీసుల దాడి సరికాదు'



సీసీసీ కార్నర్ వద్ద రాస్తారోకో చేస్తున్న నాయకులు

రామకృష్ణాపూర్: బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ ఇంటిపై పోలీసులు దాడి చేయటాన్ని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మహంకాళి శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు ఆరుముళ్ల పోషం తీవ్రంగా ఖండించారు. పేదవారికి తన ట్రస్టు ద్వారా బతుకమ్మ చీరలు పంచాలని ఇంట్లో ఉంచితే, దానిని అక్రమమని పేర్కొంటూ పోలీసులు స్వాధీనం చేసుకోవటం బాధాకరమన్నారు. ఇవే చీరలు కాంగ్రెస్ నాయకులు పంచితే లేని దాడులు, ఇప్పుడు బీజేపీ నాయకుడి ఇంటిపై చేయటం ఏమిటని ప్రశ్నించారు. నాయకులు వేముల అశోక్, మాస్ సత్యనారాయణ, బంగారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'రఘునాథ్ ఇంటిపై దాడి హేయమైన చర్య'

నస్పూర్: బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ ఇంటిపై పోలీసుల చేసిన దాడి హేయమైన చర్య అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అగల్ డ్యూటీ రాజు తెలిపారు. ఇటీవల రఘునాథ్ ఇంటిపై పోలీసుల దాడిని నిరసిస్తూ బీజేపీ శ్రేణులు మంగళవారం సీసీసీ కార్నర్ వద్ద జాతీయ రహదారిపై నల్లబ్యాడ్జీలు ధరించి రాస్తారోకో నిర్వహించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు జీవి ఆనంద్‌కృష్ణ, పార్లమెంట్ కన్వీనర్ మధు, పట్టణ కన్వీనర్ సత్రం రమేశ్, ప్రధాన కార్యదర్శి ఈర్ల సదానందం, యువమోర్చా అధ్యక్షుడు కొండ వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి అంబాల సాగర్, యువ మోర్చా జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, దళిత మోర్చా పట్టణ అధ్యక్షుడు సిరికొండ రాజు, నాయకులు పాషా, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి

- డీసీపీ రామ్‌నాథ్ కేకన్



కోనంపేటలో అవగాహన కల్పిస్తున్న డీసీపీ

నెన్నెల: శాసనసభ ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా అందరూ సహకరించాలని డీసీపీ రామ్‌నాథ్ కేకన్ అన్నారు. మావోయిస్టు ప్రభావిత పోలింగ్ కేంద్రమైన కోనంపేటను మంగళవారం సందర్శించి సీ విజిల్ యాప్ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. సీ విజల్ యాప్, కోడ్ ఉల్లంఘన అంశాలను లైవ్ ఫొటోలు, వీడియోలతో ఈసీకి ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు. మతాలను, ప్రాంతాలను, వ్యక్తులను కించపరుస్తూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట బెల్లంపల్లి ఏసీపీ సదయ్య, రూరల్ సీఐ రాజ్‌కుమార్, నెన్నెల ఎస్సై శ్యామ్‌పటేల్ ఉన్నారు.

'గడపగడపకూ పీఎస్సార్'



లక్సెట్టిపేటలో నినాదాలు చేస్తున్న నాయకులు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని 12వ వార్డు గోపాల్‌వాడలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ గడపగడపకూ పీఎస్సార్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఎన్నికల్లో ఓడిపోయినా, ప్రజలకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో ఆయన్ను గెలిపించాలని కోరారు.

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో కాంగ్రెస్ పార్టీ నాయకులు గడపగడపకూ పీఎస్సార్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్తూ గ్యారెంటీ పథకాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో పీఎస్సార్‌ను గెలిపించాలని కోరారు. అనంతరం 5వ వార్డులో పార్టీలో చేరిన అభ్యర్థులకు కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో కొక్కిరాల సురేఖ, నాయకులు చింత అశోక్, ఎండీ ఆరీఫ్, వార్డు కౌన్సిలర్ చింత సువర్ణ, శ్రీధర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో కేంద్ర అధికారుల బృందం పర్యటన



తాండూర్: గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు



బెల్లంపల్లిరూరల్: పనులు పరిశీలిస్తున్న అధికారులు

బెల్లంపల్లిరూరల్: మండలంలోని పాత బెల్లంపల్లి గ్రామంలో ఉపాధి హామీ అభివృద్ధి పనులను కేంద్ర సెక్రటేరియట్ సర్వీసెస్‌లో అసిస్టెంట్ సెక్షన్ అధికారులుగా(ఏఎస్‌వో) ప్రొబేషనరీ విధులు నిర్వర్తిస్తున్న పలువురు అధికారులు మంగళవారం పరిశీలించారు. క్రీడా ప్రాంగణం, పల్లెప్రకృతి వనం, ఇతర అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. సంక్షేమ పథకాల ద్వారా గ్రామీణులు ఏ విధంగా లబ్ధి చెందుతూ ఆర్థికంగా బలోపేతమవుతున్నారనే అంశాలపై అధ్యయనం చేశారు. కార్యక్రమంలో ఏఎస్‌వో బృందం సభ్యులు రిషవ్ దేవ్‌కుమార్ ప్రసాద్, వెంకటేష్ బాబు, హర్మీత్ కుమార్, సన్నీ కుమార్, హన్ష రాజ్ జాఖర్, ఎంపీడీవో రాజేందర్, ఎంపీవో శ్రీనివాస్, ఈజీఎస్ ఏపీవో ఎస్తర్ డేవిడ్, ఈసీ అనిల్, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

తాండూర్: మండలంలోని మాదారం గ్రామ పంచాయతీలో కేంద్ర అధికారుల బృందం పర్యటించింది. మాదారం, మాదారం-3 ఇంక్లైన్ గ్రామాల్లో కేంద్ర అధికారులు అభిషేక్, అమన్ దీప్, కౌశిక్ హిమాన్ష్, అమిత్ కుమార్, అక్షత్ గౌతం లు పర్యటించారు. సెర్ప్ ద్వారా మహిళలు తీసుకున్న రుణాలు, ఉపాధి పొందుతున్న తీరు, నెలసరి ఆదాయం గురించి మహిళలను అడిగి తెలుసుకున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల ద్వారా గ్రామీణులు పొందుతున్న లబ్ధి, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ ద్వారా అమలవుతున్న పథకాల గురించి, ఆశ కార్యకర్తల పనితీరుపై ఆరా తీశారు. నాలుగు రోజుల పాటు అధికారులు గ్రామంలో ఉంటూ ప్రభుత్వ పథకాల అమలు, పనితీరు గురించి వివరాలు సేకరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఐకేపీ ఏపీఎం పోమానాయక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత, పంచాయతీ కార్యదర్శి సౌందర్య, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమలేశ్వరి కుటుంబానికి న్యాయం చేయాలి



మాట్లాడుతున్న తుంగపిండి రమేశ్

చెన్నూర్: పట్టణంలోని పెద్ద చెరువులో దూకి ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన గురుకుల జూనియర్ కళాశాల లెక్చరర్ తిరుమలేశ్వరి కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని బీఎస్పీ చెన్నూర్ నియోజకవర్గ అధ్యక్షుడు తుంగపిండి రమేశ్ డిమాండ్ చేశారు. స్థానికంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేధింపులకు పాల్పడిన ప్రిన్సిపల్ రాజమణి, ఏసీటీ స్రవంతి, పీఈటీ రేష్మలతో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. మృతురాలి కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఆమె కూతురి విద్యకయ్యే ఖర్చు ప్రభుత్వం భరించాలన్నారు. బీఎస్పీ నాయకులు వినయ్, శ్రీనివాస్, నవీన్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కొనసాగుతున్న బతుకమ్మ సంబురాలు





మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని జీఎం ఆఫీస్ ఆవరణలో మహిళా ఉద్యోగులు మంగళవారం ముందస్తుగా బతుకమ్మ వేడుకలు జరుపుకున్నారు. వేడుకలను ఏరియా జీఎం మనోహర్ ప్రారంభించారు. మహిళా ఉద్యోగులు బతుకమ్మ పాటలు పాడుతూ ఎంజాయ్ చేశారు. ఆయన వెంట ఎస్వోటు జీఎం రాజేశ్వరరెడ్డి, పీఎం పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఆఫీస్ సిబ్బంది, మహిళా ఉద్యోగులు ఉన్నారు.

దండేపల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మంగళవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. విద్యార్థినులు పూలతో బతుకమ్మలు పేర్చి, బతుకమ్మ ఆడి సంబురాలు జరుపుకున్నారు.

బీఆర్ఎస్‌ను నమ్మొద్దు

- మాజీ ఎమ్మెల్యే ఓదెలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఓదెలు

జైపూర్: దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని కేసీఆర్ మోసం చేశారని, పథకాల పేరుతో మోసగించి మూడోసారి గెలువాలని కలలు కంటున్నారని, దళిత సామాజిక వర్గం ఆలోచించాలని మాజీ ఎమ్మెల్యే, మాజీ విప్ నల్లా ఓదెలు హితవు పలికారు. జైపూర్ మండలం ముదిగుంటలో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరగా పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు. బీఆర్ఎస్‌ను నమ్మొద్దని, కేసీఆర్ ఎన్నికల హామీలన్నీ విస్మరించారని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలుపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ స్కీంలపై వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లింగయ్య, తదితరులు ఉన్నారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు



రామకృష్ణాపూర్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని శ్రీకోదండ రామాలయంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారికి మంగళవారం మహిళలు 31 రకాల నైవేద్యాలు సమర్పించారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళలు కోలాటం ఆడారు.

చెన్నూర్: పట్టణంలోని బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపం వద్ద మంగళవారం బ్రాహ్మణ పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు సురేశ్‌శర్మ, సేవ సంఘం అధ్యక్షులు కేవీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.


క్లర్క్ పోస్టులు భర్తీ చేయాలి



నియామకపత్రం అందజేస్తున్న నేతలు

శ్రీరాంపూర్: ఖాళీగా ఉన్న క్లర్కు పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సింగరేణి కాలరీస్ క్లరికల్ అసోసియేషన్(సిక్కా) నాయకులు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ సీహెచ్‌పీ సిక్కా నూతన ఫిట్ ప్రతినిధిగా తొటం భాస్కర్‌ను నియమించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయనను డీజీఎంకు పరిచయం చేసి నియామకపత్రం అందించారు. సీహెచ్‌పీలో పనిచేసే క్లర్కులకు ఇన్సెంటివ్ ఇవ్వాలని కోరారు. స్టాఫ్ అందరికీ టేబుళ్లు, కుర్చీలు, ఫ్యాన్‌లతో పాటు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలన్నారు. కాలం చెల్లిన కంప్యూటర్ స్థానంలో కొత్త కంప్యూటర్లను ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సిక్కా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ డివిజన్ ఉపాధ్యక్షుడు కన్నం సాంబయ్య, ప్రధాన కార్యదర్శి కే శ్రీధర్, నాయకులు సదయ్య, బుచ్చి ప్రసాద్, రవి తదితరులు పాల్గొన్నారు.

సీఈఆర్ క్లబ్‌లో టీటీ, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు



టేబుల్‌టెన్నిస్ పోటీని ప్రారంభిస్తున్న జీఎం

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని ఇల్లందు క్లబ్‌లో మంగళవారం టేబుల్ టెన్నిస్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. పోటీలను ఏరియా జీఎం మనోహర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. పోటీల్లో గెలుపొందిన వారు కంపెనీ స్థాయి పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏరియా పీఎం శ్యాంసుందర్, అధికారులు, క్రీడాకారులు ఉన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

రాహుల్ దృష్టికి కార్మికుల సమస్యలు



మాట్లాడుతున్న ఐఎన్టీయూసీ నాయకులు

శ్రీరాంపూర్: ఈ నెల 19న రామగుండం ఏరియాకు వస్తున్న కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ దృష్టికి సింగరేణి కార్మికుల సమస్యలను తీసుకెళ్లనున్నట్లు ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు శంకర్‌రావు తెలిపారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పార్టీ కార్యక్రమంలో భాగంగా వస్తున్న ఆయన్ను, తమ యూనియన్ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ ఆధ్వర్యంలో నాయకులు, కార్మికులు రాహుల్‌ను కలిసి సమస్యలను తెలియజేయనున్నట్లు తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని, ఇంకా ఇతర సమస్యలను రాహుల్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఆ యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షులు స్వామి, శ్యాం, నాయకులు రాజయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బీజేపీలో చేరికలు

దండేపల్లి: మండలంలోని చింతపల్లి, కొర్విచెల్మ గ్రామాలకు చెందిన పలువురు మంగళవారం బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి, దండేపల్లి బీజేపీ పార్టీ కార్యాలయం వద్ద పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పంట పొలాల సందర్శన

నెన్నెల: మండలంలోని మన్నెగూడం గ్రామాల్లోని వరి పొలాల్లో మంగళవారం ఏఈఓ రాంచందర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ప్రస్తుతం వరిలో అగ్గితెగులు, సుడిదోమ ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యల గూర్చి వివరించారు.

26న సర్వసభ్య సమావేశం

భీమిని: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 26వ తేదీ గురువారం ఉదయం 11గంటలకు ఎంపీపీ రాజేశ్వరి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జవహర్ పేర్కొన్నారు. ఈ సమావేశానికి మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

మందమర్రిరూరల్: మండలంలోని వెంకటాపూర్ గ్రామ పంచాయతీలోని గుడిపెల్లి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. గుడిపెల్లిలో కాంగ్రెస్ నాయకుడు శీలం చిన్నయ్య ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు హాజరై పార్టీలో చేరిన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు

కోటపల్లి: మండలంలోని లింగన్నపేటలో సూపర్‌వైజర్ అశోక్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు క్షయ నిర్ధారణ పరీక్షలు చేశారు. టీబీ లక్షణాలు ఉన్నవారు పరీక్షలు చేసుకోవాలని, దీర్ఘకాలికంగా దగ్గు, ఆకలి మందగించడం, జ్వరం లక్షణాలు క్షయ వ్యాధి లక్షణాలని తెలిపారు. క్షయవ్యాధి ప్రారంభదశలోనే నిర్ధారించవచ్చని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజు, హెల్త్ సూపర్‌వైజర్ జ్యోతి, ఎంఎల్‌హెచ్‌పీ ఇంద్రజ, ఏఎన్ఎం విజయలక్ష్మి పాల్గొన్నారు.

మంచిర్యాలకు తరలిన నాయకులు

చెన్నూర్‌రూరల్: మంచిర్యాలలోని ఎంఎస్ఆర్ గార్డెన్‌లో బాల్క సుమన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్ఎస్ సోషల్ మీడియా సమావేశానికి మంగళవారం మండలంలోని ఆస్నాద, దుగ్నెపల్లి, కిష్టంపేట, కొమ్మెర, ఎర్రగుంటపల్లి గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు.